క్లుప్తంగా

గంగాదేవిపేటలో చురుగ్గా ఓటరు సర్వే



గంగాదేవిపేటలో ఓటరు సర్వే చేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని గంగాదేవిపేటలో ఓటరు సర్వే చురుగ్గా సాగుతుంది. బీఎల్‌వో భవానీ ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారికి ఓటు నమోదు కోసం అవకాశం కల్పించారు. ఓటరు జాబితాలో సవరణలపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలోని పేర్లను ఆధార్ కార్డుతో అనుసంధానం వంటి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర పాల్గొన్నారు.

కాలువ గట్టును తవ్వేసిన సర్పంచ్‌పై ఫిర్యాదు



ఒంపోలులోని కృష్ణంరాజు కాలువను ఆనుకొని ఉన్న స్థలాన్ని తవ్వేసిన దృశ్యం

మునగపాక : ఒంపోలులో కృష్ణంరాజు కాలువను ఆనుకొని ఉన్న నీటిపారుదల శాఖ గట్టును తవ్వేస్తున్న సర్పంచ్ సూరిబాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ ప్రకాశరావుకు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దొడ్డి చిన్న, నరాలశెట్టి తాతారావు, లక్ష్మణరావు, నాయుడు తదితరులు మాట్లాడుతూ కృష్ణంరాజు కాలువ ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందేదని, సర్పంచ్ సూరిబాబు చేసిన తప్పు కారణంగా ముంపు సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



పాఠశాలకు వాటర్ క్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : దాతల సహకారం సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు సూచించారు. పెదఉప్పలం పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్య దృష్ట్యా పూర్వ విద్యార్థులు సమకూర్చిన వాటర్ క్యాన్లను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గణేష్, కుమార్‌రాజా, సత్తిబాబు, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత



పట్టుబడ్డ మద్యంతో ఏఎస్‌ఐ సత్యనారాయణ

కోటవురట్ల: అక్రమంగా మద్యం సీసాలను తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. పాములవాక గ్రామ శివార్లలో సోమవారం సాయంత్రం వీరబాబు అనే వ్యక్తి మద్యం సీసాలు తీసుకెళుతుండగా పట్టుకున్నామని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

8 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

ఎస్.రాయవరం : వమ్మవరం గ్రామంలో 8 మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని అదుపులోనికి తీసుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయించేందుకు వాటిని తీసుకు వెళుతుండగా ముందస్తు సమాచారంతో నిందితుడిని పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేసి యలమంచిలి కోర్టులో హాజరు పరిచామన్నారు.

వడివడిగా.. గ్రామ స్వరాజ్యం దిశగా

- అందుబాటులోకి ప్రభుత్వ సేవలు
- జోరుగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణాలు

మునగపాక : గ్రామ స్వరాజ్యం సాధించే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గాంధీజీ కన్న కలలను సార్థకం చేసేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన, ప్రభుత్వ సేవలు అందేలా పాలనా ముద్ర వేసుకుంటున్నారు. ప్రజలకు అందుబాటులో సచివాలయాలు, రైతులకు అండగా ఉండేలా రైతు భరోసా కేంద్రాలు, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా విలేజ్ క్లినిక్‌లు వంటి సేవలు అందిస్తూ అందరి మన్ననలు ప్రభుత్వం పొందుతుంది. ఇప్పటికే పలు చోట్ల భవనాలు పూర్తికాగా మరికొన్ని చోట్ల నిర్మాణ దశల్లో ఉన్నాయి.

83 సచివాలయాలకు రూ.37 కోట్ల కేటాయింపు

నియోజకవర్గంలోని 83 సచివాలయాలకు రూ. 37 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. దీనిలో పలు భవన నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. గతంలో ప్రజలు తమకు ఏ పని కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు స్థానికంగా సకాలంలో సేవలందుతున్నాయి.

రైతులకు అండగా రైతు భరోసా కేంద్రాలు

రైతులకు పంటల యాజమాన్య పద్ధతులపై సూచనలు, సలహాలు ఇచ్చేందుకు రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. రాయితీతో కూడిన విత్తనాలు, ఎరువులు సీజన్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంచేందుకు రైతు భరోసా కేంద్రాలు దోహదపడుతున్నాయి. నియోజకవర్గంలో 79 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఒక్కో భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.21.8 లక్షల మేర నిధులు కేటాయించింది. పలు చోట్ల భవన నిర్మాణాలు పూర్తి చేయగా మరికొన్ని చోట్ల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.



చూచుకొండలోని సచివాలయం

రైతులకు ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసేందుకు ఆర్‌బీకేల్లో అధికారులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. అలాగే రైతు విజ్ఞాన కేంద్రాలుగా ఈ ఆర్‌బీకేలు సేవలందిస్తున్నాయి.

విలేజ్ క్లినిక్‌లతో ముంగిట్లోనే వైద్య సేవలు

పల్లె ప్రజలకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుసువచ్చింది. ప్రతి 2500 జనాభాకు విలేజ్ క్లినిక్ అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వెయిటింగ్ హాలు, ఎగ్జామినేషన్ రూమ్, ఓపీ గది, ఫార్మాసిస్ట్ గది, ఏఎన్‌ఎం క్వార్టర్‌తో కూడిన సదుపాయాలు ఈ



ఒంపోలులోని రైతుభరోసా కేంద్రం



నాగులాపల్లిలో నిర్మాణంలో ఉన్న విలేజ్ క్లినిక్ భవనం

కేంద్రంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని 65 విలేజ్ క్లినిక్‌లకు గాను ఒక్కో క్లినిక్‌కు రూ.20.80 లక్షల మేర నిధులు కేటాయించారు. పలు చోట్ల భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

సకాలంలో ప్రభుత్వ సేవలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు పలు రకాల సేవలు సకాలంలో అందుతున్నాయి. గతంలో కార్యాలయాల చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరిగేవారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు ఎటువంటి లంచాలకు తావు లేకుండా ప్రభుత్వ సేవలు పొందుతున్నారు.

– ఆదారి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

సచివాలయాల నిర్మాణాలు వేగవంతం



నియోజకవర్గంలో పలు సచివాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చాం. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. వాటిని సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటాం. సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా అన్ని రకాల ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయి.

– మునిశేఖర్, పంచాయతీరాజ్ డీఈ

రూ.51 కోట్లతో వార్డుల్లో అభివృద్ధికి ప్రతిపాదనలు

- విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు
- పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు
- మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి



యలమంచిలి : మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో రూ.51 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సీఎం ఆఫీస్‌కు పంపించగా, దీనికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కన్నబాబురాజుతో కలసి పర్యటించినపుడు వార్డుల్లో సమస్యలను గుర్తించి కాలువలు, రోడ్లు మరమ్మతు పనులు, శాశ్వత ప్రాతిపదికన కొన్ని పనులు చేపట్టానికి ముఖ్యమంత్రి కార్యాలయానికి ప్రతిపాదనలు అందించడం జరిగిందన్నారు. దీనికి సీఎం నిధులు మంజూరుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. యానాద్రి కాలువ సిల్ట్ పనులు, కొక్కిరాపల్లి నుంచి అగ్రహారం కాలువ మరమ్మతు పనులు యలమంచిలి ఫ్లైవర్ రోడ్డు నుంచి పట్టణంలో అన్ని వైపులా యర్రవరం వరకు రోడ్ల మరమ్మతులు పనులు చేపడతామని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు 92 మందికి రెయిన్ కోట్స్ అందించాల్సి ఉందన్నారు. సమావేశంలో 12 అంశాలతో కూడిన అజెండా పనులకు ఆమోదం తెలిపారు. కొన్ని వార్డుల్లో రోడ్లు నిర్మాణానికి కాంట్రాక్టర్‌లు ముందుకు రాక పనులు నిలిచి పోతున్నాయని, త్వరితగతిన నిర్మించే కాంట్రాక్టర్లు ఎవరైనా ఉంటే టెండర్లు వేసి పిలవాలని, బిల్లులు సకాలంలో మంజూరయ్యేలా కౌన్సిల్‌లో తీర్మానం చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ వీరయ్యకు సూచించారు. వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, కౌన్సిలర్‌లు పిట్టా సత్తిబాబు, రాపేటి సంతోష్, గొర్లె సంధ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ సయ్యిద్ బీబి, దూది నర్సింహమూర్తి, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులపై వేధింపులు అరికట్టాలి

అచ్యుతాపురం చేరుకున్న మహిళల పోరుయాత్ర



అచ్యుతాపురం మండలంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరు యాత్ర సోమవారం అచ్యుతాపురం చేరుకుంది. ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల వద్ద జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగు తున్న హింసను అరికట్టేందుకు నిపుణులతో కూడిన కమిటీ వేయాలని సూచించారు. నిందితులను శిక్షించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పా టు చేయాలన్నారు. హింస, అశ్లీలతను ప్రేరేపించే చలన చిత్రాలు, సీరియల్స్‌ను నిషేధించాలని కోరారు. డీఎడిక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. జూలై 28న ప్రారంభమైన జాతా ఆగస్టు 8న విజయవాడలో నిర్వహించే బహిరంగ సదస్సుతో ముగుస్తుందని తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, విశాఖ జిల్లా కార్యదర్శి సత్యవతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి, ఉపాధ్యక్షురాలు పూర్ణ, సీఐటీయూ నాయకులు రాము, సోము నాయుడు, లక్ష్మి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

మునగపాక : మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం మెయిన్‌రోడ్డులో ఆందోళన నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ మాట్లాడుతూ దేశంలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఇందుకు కార ణం మత్తు పదార్థాలేనన్నారు. వీటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

మహిళా పాడి రైతులకు రుణాల పంపిణీ



మహిళా రైతులకు రుణాలు అందజేస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు

మునగపాక : సహకార సంఘ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు కోరారు. సోమవారం సంఘ ఆవరణలో అమూల్ మహిళా పాడి రైతులకు ఆయన రుణాలు అందజేశారు. ఆరుగురు మహిళా రైతులకు ఒక్కొక్కరికీ రూ.30వేల వంతున రూ.లక్షా 80వేల మేర రుణం అందజేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘ సభ్యులకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు. సంఘ డైరెక్టర్లు ఆడారి గణేశ్వరరావు, కొయ్య వెంకటప్పారావు(చక్రం), సీఈవో ఆడారి వేణుగోపాలరావు, సిబ్బంది పెంటకోట మహేష్ పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు ఘన సత్కారం

పాయకరావుపేట : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 600 గాను 594 మార్కులు సాధించి అనకాపల్లి జిల్లా టాపర్‌గా నిలిచిన కట్నం సత్య అనంతలక్ష్మి సుప్రజను గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.అశోక్ సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు చేతుల మీదుగా గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ సుప్రజను అభినందిస్తూ తనకి ప్రోత్సాహకంగా ట్యాప్‌టాప్, జ్ఞాపికలను అందించారు. ముర్రుముత్యాల నాయుడు సుప్రజను అభినందించి, భవిష్యత్తులో మరెన్నో విజయాలను అందిపుచ్చుకోవాలని ఆశీర్వదించారు. మిగిలిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, పట్టుదల వుంటే అందరూ ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని తెలిపారు.

కృతజ్ఞతాభావం గొప్పది



గంగాధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఎవరివద్దయినా ఉపకారం పొందినప్పుడు, ఆ కృతజ్ఞత చూపడం ఎంతో గొప్పదని, దానికి విలువ కట్టలేమని నన్నయ్య యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన జిల్లా ఎస్ఎస్ఎఫ్ ధర్మప్రచారక్‌లు, కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తిభావం వలన ప్రతి ఒక్కరిలో సేవా గుణం, సత్వగుణం అలవడుతుందని చెప్పారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయ సమావేశాలు కంటే, ఇటువంటి ఆధ్యాత్మిక సమావేశాల్లో పాల్గొంటే ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ ఉత్తరాంధ్ర జిల్లాల ధర్మప్రచారక్ ఆడారి గంగాధర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలినాటి నానాజీ తదితరులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు నక్కపల్లి రెల్లివీధి, కొత్తపేటలో ఎస్ఎస్ఎఫ్, నక్కపల్లి సత్యసాయిభజన మండలి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ కె.లలిత, కట్టా వీరబాబు, వెంకటరెడ్డి, సేనాపతి సూర్యారావు, దవరసింగి రాంబాబు, అల్లు లక్ష్మి విజయ్ పాల్గొన్నారు.

గంగాధర్‌కు ఘన సత్కారం

స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ ఆడారి గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు. ఉపమాక దుర్గాభవానీ పీఠం తరపున నన్నయ్య యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ముర్రు ముత్యాలనాయుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, గురు భవానీ రాంబాబు, ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధులు లలిత, వీరబాబు, బీజేపీ నాయకుడు నానాజీ తదితరులు గంగాధర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించి శేషవస్త్రంతో సత్కరించారు.

దోమలను పారదోలండి..



దిమిలిలో విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ

రాంబిల్లి : డెంగ్యూపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దిమిలి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఎస్.ఎస్.రాజు, హెల్త్ సూపర్ వైజర్ సీహెచ్ ధనరాజ్ అన్నారు. సోమవారం దిమిలిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చినమ్మలు పాల్గొన్నారు.

రీ-సర్వే వేగవంతం చేయాలి

మునగపాక : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వే వేగవంతమయ్యేలా చూడాలని తహసీల్దార్ పి.ప్రకాశరావు కోరారు. మునగపాక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వీఆర్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. ఇంతవరకు గ్రామాల వారీగా జరిగిన సర్వేకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సరిహద్దులు కేటాయించే క్రమంలో రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. సరిహద్దు రాళ్ల పాతడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల అవకతవకలపై విచారణ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులా వాణి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెం సచివాలయం పరిధిలో ధ్రువీకరణ పత్రాల సృష్టి, కార్యదర్శి సంతకం ఫోర్జరీ వంటి అంశాలపై నిగ్గు తేల్చేందుకు పంచాయితీ అధికారులు రంగంలోకి దిగారు. డీఎల్‌డీఓ మంజులా వాణి, డీపీవో శిరీషారాణిలు సచివాలయ సిబ్బందిని సోమవారం విచారణ చేశారు. రికార్డులను పరిశీలించి, ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న తీరుపై విచారణ జరిపారు. ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందా, సాంకేతిక లోపాలా అనే అంశంపై నిగ్గు తేల్చి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. ఇంటి పన్ను వసూలు చేస్తున్నట్టు మహిళా పోలీసులపై కూడా వారు విచారణ జరిపారు. డిజిటల్ అసిస్టెంట్ సృష్టించిన నకిలీ పెళ్లి ధ్రువపత్రంతో పాటు, ఇతర అవకతవకలపై లోతుగా విచారణ జరుపుతున్నామని, అయితే ఇక్కడి సిబ్బంది వివరణ పొంతన లేదని వారు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాశరావు

మునగపాక : ప్రతి ఒక్కరూ హక్కుల సాధనకు పాటుపడాలని తహసీల్దార్ ప్రకాశరావు కోరారు. మునగపాక దళితవాడలో సోమవారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ మాట్లాడుతూ చిన్నచిన్న వివాదాలను పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీడీవో మన్మథరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాహనం ఢీకొని పాడి గేదె మృతి



రహదారిపై మృతి చెందిన గేదెను పరిశీలిస్తున్న పోలీసులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఏరిపల్లి అప్పన్నకు చెందిన పాడి గేదెను లారీ ఢీకొనడంతో మృతి చెందింది. ప్రధాన రహదారిపై గేదెను ఢీకొన్న లారీ కోసం పోలీసుల సీసీ ఫుటేజిలు పరిశీలించారు. బాధితునికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తక్కువ ధరకు మొక్కలు అందిస్తాం



ఏపీఎం శివప్రసాద్

ఎస్.రాయవరం : స్వయం సహాయక సభ్యులు మొక్కలు పెంచుకోవాలంటే ఐకేపీ ద్వారా ధరలు తగ్గించి మరిన్ని మొక్కలు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏపీఎం తెలిపారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'పచ్చగా జనం మెచ్చగా' అనే శీర్షికకు ఏపీఎం స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు కడియం నర్సరీ నుంచి అన్ని రకాల మొక్కలు తీసుకు వస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఉండే గ్రామాల్లో వీఓఏలను సంప్రదించవచ్చన్నారు. కడియం నర్సరీలో వంద నుంచి 120 ఉండే మామిడి మొక్క మండలానికి చేరేసరికి రూ.55కే వస్తుందన్నారు. మండలానికి వచ్చేసరికి జీడి రూ.50, సీతాఫలం రూ.50, నిమ్మ రూ.35, సపోటా రూ.50, జామ రూ.40, కొబ్బరి రూ.70, బత్తాయి రూ.65, చింత రూ.65 ఉన్నాయన్నారు. ఇవేకాకుండా నేరేడు తదితర రకాలు మొక్కలు కూడా లభ్యమవుతున్నాయని, కావాల్సిన వారు సమాచారం ఇచ్చి ఎన్ని మొక్కలు కావాలో చెబితే తీసుకువస్తామన్నారు.